# సాక్షి సూర్యాపేట

శనివారం । 20 । మే । 2023






**భూసార పరిరక్షణకు..**
భూసార పరిరక్షణకు కృషిచేయాలని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరావు అన్నారు. - 8లో



**మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం**
తిరుమలగిరిసాగర్‌లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
42° / 28°

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పూట సూర్యరశ్మి అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కన్వీనర్ ఎస్.గోపాల్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వ తేదీ వరకు పదో తరగతి, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

### నేడు హుజూర్‌నగర్‌కు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని న్యాయస్థాన భవన పరిశీలనకు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శనివారం పట్టణానికి రానున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, పీఆర్‌ఓ కాల్వ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి స్వాగతం పలికి సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మట్టపల్లి ఆలయాన్ని సందర్శిస్తారని తెలిపారు.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం గావించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచ గవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

### సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నీతి, నిజాయితీ, నిడారంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనం పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాంతం తాడిత, పీడిత, పేద ప్రజల విముక్తి కోసం పనిచేసిన మహానేత అని తెలిపారు. వందలాది ఎకరాల భూమిని పేద దళితులకు పంచి ఇచ్చిన ఘనత సుందరయ్యకే దక్కిందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీకి ఎన్నికైనప్పటికీ సైకిల్ పై వెళ్లేవారని గుర్తుచేశారు. నేటి యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్, జిల్లపల్లి నరసింహారావు, ధనియాకుల శ్రీకాంత్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేటలో వచ్చే నెల 4వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కుంచం చంద్రకాంత్ కోరారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ జన సమితి లీగల్ సెల్ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల ఆత్మ బలిదానాలు, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ ఆగం చేశారని, మన రాష్ట్రాన్ని మనమే కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా కో కన్వీనర్ వీరేష్, లీగల్ సెల్ బాధ్యులు రామకృష్ణ, అనిల్, మహేష్, లోకేష్ పాల్గొన్నారు.

## రూ.2వేల నోటు రద్దు మంచిదే..

- సామాన్యులపై ప్రభావం ఉండదు
- దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం
- ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందంటున్న ఆర్థిక నిపుణులు




సూర్యాపేట: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్లను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఈ నోట్లు ఉన్నవారు సెప్టెంబర్ 30 వరకు రోజుకు 25 చొప్పున మార్చుకోవచ్చని సూచించింది. అయితే రూ.2వేల నోట్ల రద్దుపై వివిధ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2వేల నోట్ల రద్దుతో దేశంలో 95 శాతంగా ఉన్న సామాన్య ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. బ్లాక్ మనీని అరికట్టే చర్యల్లో భాగంగా మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంగా భావించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్ 16 నుంచి రూ.2వేల నోటును తీసుకువచ్చింది. ఆతర్వాత 2018 నుంచి ఈ నోటు పెద్దగా చలామణీలో లేదు. సామాన్యుల చేతుల్లోనూ ఈ నోట్లు చలామణిలో లేవని, బ్యాంకుల్లోనూ తక్కువగా ఉన్నాయని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యూహాత్మకంగానే ఈ నోట్ల ప్రింటింగ్ ఆపి చాలా రోజులైందని పలువురు చెబుతున్నారు. ఒక వేల ఆర్థిక అక్రమార్కుల వద్ద రూ.2 వేల నోట్లు ఉంటే ట్యాక్స్ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉందంటున్నారు. చలామణీలో ఉన్న రూ.2 వేల నోట్లు బ్యాంకుల్లోనూ, చాలా వరకు రాజకీయ నాయకులు, బ్లాక్ మార్కెట్ నడిపే వారి చేతిలో ఉన్నాయని, సార్వత్రిక ఎన్నికల్లోకి ఈ నోట్లు రాకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావించాలని మరికొందరు పేర్కొంటున్నారు. మొత్తంగా పెద్ద నోట్ల రద్దుతో సామాన్యులకు ప్రత్యక్షంగా వచ్చే లాభం లేకపోయినప్పటికీ దేశంలో బ్లాక్ మనీ తగ్గడం వల్ల కాస్త ద్రవ్యోల్బణం అరికట్టబడుతుందని, ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడుతుందని దీంతో ధరలు తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే పేదలు, మధ్యతరగతి వారు మాత్రమే నోట్లు మార్చుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కొంత సమయం ఇస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

**మంచి చర్య**



రూ.2వేల నోట్ల రద్దు మంచి చర్య. ఈ నిర్ణయాన్ని ఆహ్వానించాల్సిందే. సామాన్యులు ఈ నోట్లను మార్చుకునే అవకాశాన్ని సెప్టెంబరు 30 వరకు ఇచ్చినందున ఎలాంటి ఇబ్బంది ఉండదు. పెద్ద మొత్తంలో మార్పిడి జరిగితే 30 లేదా 40 శాతం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపుతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి ద్రవ్యోల్బణం తగ్గుతుంది. మొదట్లోనే ఈ నోట్లను ప్రింట్ చేయడం సరైంది కాదని చాలామంది ఆర్థికవేత్తలు తెలిపారు. ఇప్పటికైనా రద్దు చేయడం మంచి పరిణామం.

– పెద్దిరెడ్డి గణేష్, సుధాబ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సూర్యాపేట

**ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం**



పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ఎప్పుడో తీసుకోవాల్సింది. రూ. 2వేల నోటుతో సామాన్యులకు పెద్దగా ఉపయోగం లేదు. ఈ నోట్లు మొత్తం బ్లాక్ మార్కెట్‌లోనే ఉన్నాయి. సామాన్య ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఈ నిర్ణయంలో సామాన్యులకు మేలు జరుగుద్ది. దీంతో వ్యాపారాలు సజావుగా సాగి వృద్ధి చెందుతాయి. ఎన్నికల ముందు నోట్ల ఉపసహరణ అనేది నోటుకు ఓటు చేసే రాజకీయ పార్టీలకు పెద్ద చావు దెబ్బ..ఇదో రకపు సర్జికల్ స్ట్రైక్ అని చెప్పవచ్చు.

– సుదర్శన్ ,సూర్యాపేట పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ

**మార్పిడిలో ఇబ్బందులు కలగనీయొద్దు**



రాబోయే ఎన్నికల్లో రూ.2 వేల నోట్ల రద్దు ప్రభావం పడుతుంది. పెద్ద నోట్ల రద్దుతో ధనవంతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. మామూలు వారిపై దాని ప్రభావం అంతగా ఉండదు. రద్దయిన నోట్ల మార్పిడి విషయంలో బ్యాంక్ అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగనీయొద్దు.

లక్ష్మీనర్సింహారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, హుజూర్‌నగర్

**తగినంత సమయమివ్వాలి**



రూ.2వేల నోట్ల రద్దుతో సామాన్యులపై ఎలాంటి ప్రభావం ఉండదు. కానీ వ్యాపార రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నోట్లు మార్చుకునేందుకు తగినంత సమయం ఇస్తే వ్యాపారులకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. అయితే అధిక మొత్తంలో మార్చుకునే అవకాశం ఇవ్వాలి.

– గండూరి ప్రకాష్, వ్యాపారవేత్త, సూర్యాపేట

**పకడ్బందీగా అమలు చేయాలి**



రెండు వేల రూపాయల నోటు రద్దు చేస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినది. కానీ ఈ నోట్లను వెనక్కు తీసుకొనే సమయంలో విధివిధానాలను పకడ్బందీగా అమలు చేయాలి. దీని వల్ల నల్లధనం వెలికితీయొచ్చు. కార్పొరేట్, రాజకీయ అవినీతిని అరికట్టడానికి, అవినీతి నిరోధానికి కూడా దోహదపడుతుంది. త్వరలో జరిగే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేసి ఓటర్లను ప్రభావితం చేయడం తగ్గిపోతుంది.

– బడుగుల సైదులు, ఆర్థిక, సామాజిక విశ్లేషకుడు, కోదాడ

**లారీ ఓనర్లపై ఎక్కువ ప్రభావం**



లారీలు వేరే రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ సరుకు దిగుమతి సమయంలో కిరాయిలు నగదు రూపంలో చెల్లిస్తారు. వారు ఎక్కువగా రూ.2 వేల నోట్లే ఇస్తారు. ఈ నోట్లు బంకుల్లో, ఇతర చోట్ల లైన్ ఖర్చు పెట్టేందుకు వీలు పడదు. ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దుతో లారీ ఓనర్లపై ఎక్కువ ప్రభావం పడుతుంది. బంకుల్లో, టోల్ గేట్లలో, ఇతర చోట్ల లారీ డ్రైవర్ల వద్ద నుంచి రూ.2 వేల నోట్లు తీసుకునే విధంగా వెసులుబాటు కల్పించాలి.

– సంపత్‌రెడ్డి, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, హుజూర్‌నగర్

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

తిరుమలగిరి (తుంగతుర్తి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గానికి సంవత్సరం మొత్తం సాగు నీరు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. 24 గంటల విద్యుత్ ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోనూ 6 గంటల విద్యుత్ వస్తుందన్నారు. గుజరాత్‌లో మోటార్లకు మీటర్లు పెట్టారని, ఒక్కో రైతుకు సంవత్సరానికి రూ.5 వేలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో గాదరి కిశోర్‌కుమార్‌ను 50 వేల మెజార్టీకి తగ్గకుండా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో 93,929 మంది రైతులకు రైతుబంధు కింద ఇప్పటికే రూ.1,100 కోట్లు వచ్చాయన్నారు. 11వేల మందికి కల్యాణలక్ష్మి, 18,252 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఇచ్చామని తెలిపారు. 49వేల మందికి ఆసరా పింఛన్లు అందుతున్నాయని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన తిరుమలగిరి మండలంలో దళిత బంధులో ఎలాంటి అక్రమాలు జరుగలేదన్నారు. ఇసుక దందాలో ఎవరైనా రూ.5 లక్షలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అనంతరం ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుండి జరిగే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు తిరుమలగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు భారీ స్వాగతం పలికారు. గాంధీనగర్ నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొమ్మినేని స్రవంతి, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, దూపటి రవీందర్, కరుణాకర్, భాస్కర్, యాకూబ్‌నాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



### కాళేశ్వరం జలాలతో సుభిక్షం



రైతులతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్: కాళేశ్వరం జలాలతో పంటలు సుభిక్షంగా ఉన్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని న్యూబంజారాహిల్స్ తండా, చిన గారకుంట, పెదగారకుంట, చిన సీతారాంతండాలో రైతులతో మాట్లాడారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. న్యూ బంజారాహిల్స్ తండాలో యువత క్రికెట్ కిట్ కావాలని మంత్రిని కోరగా.. వారికి క్రికెట్ కిట్ అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దొంగరి యుగేందర్, సర్పంచ్‌లు భిక్షం, లక్ష్మణ్, శాలిబాయి తదితరులున్నారు.

## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



హుజూర్‌నగర్‌లో హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉత్తమ్, నాయకులు

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, హుజూర్‌నగర్: రాష్ట్రంలో అధికార పార్టీకి సమయం దగ్గర పడిందని, త్వరలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అప్పుడు వడ్డీతో సహా లెక్కలు సరిచేస్తామని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ, హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో తనతో పాటు అనేక మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారని, ఎవరూ మట్టిపై పన్ను వసూలు చేయలేదని, కానీ ప్రస్తుత ఎమ్మెల్యే మట్టిని కూడా వదలకుండా పన్ను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికారులు వేధింపులు ఎక్కువయ్యాయని, పోలీసులు చట్టం పరిధి దాటి అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలను పక్కాగా ఎదుర్కోవడానికి ప్రతి 100 మంది ఓటర్లకు ఒక సమన్వయ కర్తను నియమించాలని బూత్, గ్రామ, మండల, మున్సిపల్ వార్డు, పట్టణ కమిటీలను వెంటనే ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉండాలని నాయకులకు సూచించారు.

**చరిత్ర తిరగరాసే విధంగా తీర్పు ఇవ్వాలి**

పార్లమెంట్‌లో తన హాజరు నూరుశాతం ఉందని, భారత రక్షణ శాఖకు, విద్యుత్ శాఖకు సంబంధించి పార్లమెంట్ కమిటీలో కీలక పాత్ర పోషించానని తెలిపారు. హుజూర్‌నగర్‌లో జరుగుతున్న అధికార పార్టీ చిల్లర రాజకీయాలు, అక్రమాలు, పోలీస్ వేధింపులు చాలా బాధ కలిగిస్తున్నాయన్నారు. అలా చేస్తున్నవారు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు ప్రతి వైన్ షాపు నుంచి రూ.4 లక్షలు తీసుకుంటున్నారని, సాండ్, వైన్, మైన్ పేరుతో అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు కోరుకుంటేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో హుజూర్‌నగర్ చరిత్ర తిరగ రాసే విధంగా తీర్పు ఇవ్వాలని ఉత్తమ్ కోరారు. కొందరు సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అది గమనించాలన్నారు. అనంతరం హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌పై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయా సమావేశాల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, టీపీసీసీ నాయకులు నిరంజన్, జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, రాష్ట్ర కార్యదర్శి నగేష్ ముదిరాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, స్థానిక నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పారా సీతయ్య, కందుల కోటేశ్వరరావు, కంభంపాటి శ్రీను, వరప్రసాదరెడ్డి, బషీర్, ముస్కు శ్రీనివాసరెడ్డి, సంతోష్‌రెడ్డి, మాతంగి బసవయ్య, సైదానాయక్, బాగ్దాద్, సాముల శివారెడ్డి, యరగాని నాగన్న, తన్నీరు మల్లిఖార్జున్, డీవీ, కొట్టే సైదేశ్వరరావు, మంజూ నాయక్, అంజన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, భూక్యా గోపాల్, సత్యరాయణరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి 'సీఎం కప్'

సూర్యాపేటటౌన్: జిల్లా స్థాయిలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్స్ కప్ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు 22లోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఆడేందుకు 1,066 మంది ఎంపికయ్యారని తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, యువతీ, యువకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఈ నెల 22వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## సన్నద్ధత ఏదీ?

- పదో తరగతి పరీక్షల్లో 1,703 మంది విద్యార్థులు ఫెయిల్
- వీరందరికీ ప్రత్యేక తరగతుల నిర్వహణపై సందిగ్ధం

సూర్యాపేటటౌన్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధతపై జిల్లా విద్యాశాఖ ఇప్పటికీ ఎలాంటి ప్రణాళిక రూపొందించలేదు. వచ్చే నెల 24వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోపు విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో సన్నద్ధం కావాల్సి ఉంది. వేసవి సెలవులు ఉండడంతో ఉపాధ్యాయులెవరూ అందుబాటులో లేరు. ఆయా పాఠ్యాంశాల్లో విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేయలేని పరిస్థితి. అయితే టెన్త్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు ఎలా ప్రిపేర్ కావాలని సందిగ్ధంలో ఉన్నారు.

**10,963 మంది విద్యార్థులు ఉత్తీర్ణత...**

జిల్లాలో జెడ్పీ, ప్రభుత్వ, ఎయిడెడ్, మోడల్, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనార్టీ పాఠశాలలు కలుపుకుని 950 పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు 318 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఏప్రిల్‌లో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షలో 12,190 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10,963 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 89.9శాతం ఉత్తీర్ణత నమోదైంది. కొన్ని పాఠశాలల్లో 50శాతం లోపే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 1,703 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరందరికి సప్లిమెంటరీ పరీక్షకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు తీసుకుంటే బాగుంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఇంటి వద్ద ఉండే చదువుకోవాలి**

ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించి ఇంటి వద్ద నుంచే చదువుకొని పరీక్ష రాయాల్సి ఉంటుంది. సప్లిమెంటరీ పరీక్షకు ప్రత్యేక తరగతులు లేవు. ఇప్పటివరకు పైఅధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఒకవేళ ఆదేశాలు వస్తే ఎక్కువగా ఎక్కడ ఫెయిలయ్యారో చూసి తరగతులు నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తాం.

– అశోక్, డీఈఓ

## ఫలించిన పోరాటం



తిరుమలగిరిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

- వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- విద్యార్హతను బట్టి ఇతర శాఖల్లో సర్దుబాటు
- జిల్లాలో 559 మందికి లబ్ధి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు 80 రోజుల పాటు సాగించిన పోరాటానికి ఫలితం దక్కింది. వీఆర్‌ఏల చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో వీఆర్‌ఏల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలో 559 మంది వీఆర్‌ఏలు శాశ్వత ఉద్యోగులుగా మారనున్నారు.

**అర్హతకు తగ్గ కొలువులు**

వీఆర్‌ఏల ఖాళీలను బట్టి రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖల్లో సర్దుబాటు చేయనున్నట్లు మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. జిల్లాలో మొత్తం 559 మంది వీఆర్‌ఏలు పని చేస్తుండగా.. ఇందులో 2012, 2014లో రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 106 మంది నియమితులయ్యారు. మిగిలిన వారంతా వారసత్వ పద్ధతిన వీఆర్‌ఏలుగా కొనసాగుతున్నారు. డిగ్రీ అర్హత కలిగిన వారికి జూనియర్ అసిస్టెంట్, ఇంటర్ వారికి రికార్డు అసిస్టెంట్, పదో తరగతి, అంతకంటే తక్కువ అర్హత కలిగిన వారిని ఆఫీసు సబార్డినేట్, లస్కర్‌లుగా నియమిస్తారని తెలుస్తోంది. జిల్లాలో 209 మంది డిగ్రీ పూర్తయిన వారు, 85మంది పదో తరగతి అర్హత కలిగినవారు, 170 మంది పదో తరగతి కంటే తక్కువ అర్హత కలిగినవారు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. 54 సంవత్సరాల వయసు పైబడిన వారు జిల్లాలో 104 మంది ఉండగా వీరి వారసులకు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. శాఖలు, పోస్టుల కేటాయింపు వ్యవహారం మరో వారం, పది రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం వీఆర్‌ఏలు గౌరవవేతనం కింద రూ.11,600 పొందుతున్నారు. క్రమబద్ధీకరణతో వేతనం పెరగడంతో పాటు శాశ్వత ఉద్యోగులుగా సేవలందించనున్నారు.

**శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం సంతోషం**

సర్వీసు రెగ్యులర్ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఆలస్యమైనా ప్రభుత్వం మా సేవలను గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించడం సంతోషంగా ఉంది. ఏ శాఖలో సర్దుబాటు చేసినా నిబద్ధతతో సేవలందిస్తాం. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాం.

– షేక్ మహమ్మద్ రఫీ, వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్

**80 రోజుల పాటు సమ్మె..**

తాము విధివిధానాలు లేకుండా పనులు చేస్తున్నామని, తమ సర్వీసు క్రమబద్ధీకరణకు ఎప్పటి నుంచో పోరాటాలు చేస్తూ వస్తున్నామని వీఆర్‌ఏలు పేర్కొంటున్నారు. ఈమేరకు 2022 జూలై 25 నుంచి అక్టోబరు 13 వరకు 80 రోజుల పాటు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. కలెక్టరేట్, అసెంబ్లీ ముట్టడితో పాటు తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసనలు తెలిపారు. అప్పట్లో మునుగోడు ఎన్నికల తర్వాత సమస్యను పరిష్కరిస్తామని మంత్రి కేటీఆర్ హామీనిచ్చినా అది నెరవేరలేదు. మరోమారు ఆందోళనకు సమాయత్తమవుతున్న తరుణంలో ప్రభుత్వం వారిని క్రమబద్ధీకరిస్తున్నట్లుగా ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సకాలంలో విత్తనాలు అందించాలి

- కలెక్టర్ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలపై హోల్‌సేల్, రిటైల్ డీలర్లు, పీఏసీఎస్ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం- 2023 సీజన్‌లో జిల్లాలోని రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా టాస్క్‌ఫోర్స్ టీం ద్వారా అన్ని దుకాణాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. రిటైల్ డీలర్లు పీఓఎస్ మోషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్, డీఎం మార్క్ ఫెడ్ జ్యోతి, డీఎం ఆగ్రోస్, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### టైలరింగ్, ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

**భూదాన్‌పోచంపల్లి:** మండలంలోని జలాల్‌పురంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 6నెలల కాల పరిమితి కల్గిన టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్ట్‌బ్యాగుల తయారీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి పాసై, 18 నుంచి 25 సంవత్సరాల లోపు వయసు కల్గిన యువతులు ఈనెల 29న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు తమ విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎంపికై న అభ్యర్థులకు ఉచిత భోజనవసతి కూడిన హాస్టల్ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే శిక్షణ పూర్తయిన తరువాత ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు 9182405414, 9133908000, 9133908111 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### పూరిల్లు దగ్ధం

**నేరేడుచర్ల :** నేరేడుచర్ల మండలం వైకుంఠాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జానలదిన్నలో శుక్రవారం ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తక్కెళ్ల సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పూరిల్లు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఇరుగుపొరుగు వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన మంటలు ఆగకపోవడంతో హుజూర్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధంకాగా ఇంట్లో ఉన్న 30 వేలు , దుస్తులు, సామగ్రి , బియ్యం దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రెండున్నర లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సైదులు పేర్కొన్నాడు.

### బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

**బీబీనగర్ :** బైక్ అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని ఎయిమ్స్ ఎదుట శుక్రవారం చోటు చేసుకుంది, ఎస్ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరు నాగారం గ్రామానికి చెందిన కుమ్మరి బాలాజీ(28) శుక్రవారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా బీబీనగర్‌లోని ఎయిమ్స్ వద్దకు రాగానే అతివేగంతో అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో బాలాజీకి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఓయూ అధ్యాపకుడు ఖాసీం



విగ్రహావిష్కరణలో పాల్గొన్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ, సర్పంచ్

**చౌటుప్పల్ :** అణగారినవర్గాల అభ్యున్నతికి శ్రమించిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఓయూ తెలుగుశాఖ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ గురువారం రాత్రి జరిగింది. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ పూలే, అంబేద్కర్‌ల జీవితం ఎంతో గొప్పదన్నారు. హక్కులు, రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజాత, తెలంగాణ క్రాంతిదళ్ కన్వీనర్ సంగిశెట్టి పృథ్వీరాజ్, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సర్పంచ్ ఆకుల సునిత శ్రీకాంత్, ఉపసర్పంచ్ గంగాపురం గంగాధర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఆకుల గణేష్, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ, ఆవిష్కరణ కమిటీ అధ్యక్షుడు తూర్పింటి యాదయ్య, నిర్వాహకులు వెంకటేశం, పరశురాములు, శివకృష్ణ, శ్రీకాంత్, రాములు ఉన్నారు.

# 'పేట' గ్రంథాలయంలో మధ్యాహ్న భోజన సౌకర్యం



సూర్యాపేటలోని గ్రంథాలయంలో యువతికి భోజనం వడ్డిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి

- ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**భానుపురి (సూర్యాపేట) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే గ్రంథాలయంలో అదనపు సీటింగ్ కోసం కావాల్సిన షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండు రోజుల క్రితం సూర్యాపేట పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ జిల్లా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా మంత్రి జగదీశ్ రెడ్డి సందర్శించారు. ఈ సమయంలో విద్యార్థులతో ముచ్చటిస్తూ గ్రంథాలయంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసిన మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటనే సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనాన్ని అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు నిత్యం గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అందుబాటులోకి తీసుకొచ్చి స్వయంగా తానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయానికి భారీగా తరలి వస్తుండడంతో సీటింగ్ సమస్య ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం అదనపు షెడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మరో మూడు రోజుల్లోనే నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, బీఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తాహెర్ పాషా, నిమ్మల స్రవంతి, రాపర్తి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, నాయకులు గుడిపూడి వెంకటేశ్వర్లు, ఎల్గూరి రమ కిరణ్ గౌడ్, ఎస్ కే రఫీ, శ్రీనివాస్ యాదవ్, సల్మా, కరుణశ్రీ, అంజమ్మ, దండు రేణుక, అధికారులు పాల్గొన్నారు.

# భూసార పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

**గరిడేపల్లి :** సహజ వ్యవసాయంతో భూసార పరిరక్షణకు కృషిచేయాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరావు అన్నారు. గరిడేపల్లి మండలం కేవీకేలో శుక్రవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) - హైదరాబాద్ ఆర్థిక సహాయంతో నేల ఆరోగ్య పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహజ, సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారం అభివృద్ధి చెందుతుందని, ఈ జీవన ఉత్పత్తులు తక్కువ ఖర్చుతో రసాయనిక ఎరువులు మందులకు సమానంగా పనిచేస్తాయని అన్నారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.లవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక మోతాదులో వాడటం వలన ఖర్చు పెరిగి ఆదాయం తగ్గుతుందని అన్నారు. రైతులు సేంద్రియ, పకృతి వ్యవసాయం చేయడం వలన ఖర్చుతగ్గి నేల ఆరోగ్యం పెరుగుతుందన్నారు. . మేనేజ్ ఫ్యాకల్టీ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రతి పంట వేసే ముందు మట్టిన మూనాను పరిరక్షించిన తరువాత వేసే పంటకు అవసరమైనంత మోతాదులోనే ఎరువులు వాడుకోవాలని అన్నారు. కేవీకే కంపాసాగర్ మృతిక శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మట్టి పరీక్ష చేసే విధానాన్ని రైతులకు తెలియజేశారు.కేవీకే శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, సేంద్రియ ఎకరువుల వాడకం లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో బేయర్ టెరిటరీ మేనేజర్ లక్ష్మీనారాయణ, శాస్త్రవేత్తలు ఆదర్శ్, నరేష్ తదితరులున్నారు.

## మెట్టవరి, డ్రమ్‌సీడ్ పద్ధతిలో అధిక దిగుబడి

**వేములపల్లి:** మెట్టవరి, డ్రమ్ సీడ్ పద్ధతిలో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పృథ్వీరామ్ సూచించారు. శుక్రవారం శెట్టిపాలెం గ్రామంలోని రైతువేదిక ఆవరణలో రైతులకు మెట్టవరి, డ్రమ్ సీడ్ పద్ధతిలో వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నక్క శేఖర్, మజ్జిగపు సుధాకర్ రెడ్డి, రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పృథ్వీరామ్

## కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఇద్దరికి జరిమానా

**నిడమనూరు:** కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఇద్దరు నిందితులకు రూ. రెండు వేల జరిమానా విధిస్తూ నిడమనూరు మున్సిఫ్ కోర్టు జడ్జి స్వప్న శుక్రవారం తీర్పునిచ్చారు. 2016 సెప్టెంబర్ 17వ తేదీన త్రిపురారంలో గణేష్ శోభాయాత్ర నిర్వహిస్తూ అరుస్తుండగా కానిస్టేబుల్ గంటికంపు శేఖర్ వారించారు. ఈ క్రమంలో బైరమ్ సురేష్, అవిరెడ్ల అశోక్ ఇద్దరూ కానిస్టేబుల్‌ను తిట్టి, ట్రాక్టర్ టైర్ కిందకి నెట్టేశారు. కానిస్టేబుల్ గంటికంపు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాడు త్రిపురారం ఎస్ఐ యాలాద్రి కేసు నమోదు చేశారు. శుక్రవారం నిడమనూరు మున్సిఫ్ జడ్జి కోర్టులో తుది విచారణలో నేరం నిరూపితం కావడంతో బైరం సురేష్, అవిరెడ్ల అశోక్‌లకు రెండు వేల చొప్పున రూపాయల జరిమానా విధిస్తూ చెల్లించని పక్షంలో నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి స్వప్న తీర్పు చెప్పారు.

## 200 కిలోల గంజాయి పట్టివేత?

**అడ్డగూడూరు :** అడ్డగూడూరు పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు శుక్రవారం రాత్రి మండల పరిధిలోని చౌళ్లరామారంలో తొర్రూరు- వలిగొండ రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు ఆంధ్రా ప్రాంతం నుంచి అశోక్‌లీలాండ్ వాహనంలో తరలిస్తున్న 200 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఆ వాహనంతో పాటు గంజాయిని సీజ్ చేసి అందులోని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

## కృష్ణాకాలనీలో చోరీ

- 13 తులాల బంగారం, రూ.2.50లక్షల నగదు అపహరణ



బాలకృష్ణ ఇంట్లో దుండగులు తెరిచిన బీరువా

**మిర్యాలగూడ టౌన్ :** గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణంలోని కృష్ణాకాలనీలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కృష్ణాకాలనీకి చెందిన చెరుపల్లి బాలకృష్ణ కుటుంబ సభ్యులు గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని ఓ ఆలయ దర్శనానికి వెళ్లారు. తిరిగి శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులకొట్టి బెడ్ రూమ్‌లో గల బీరువా తెరిచి ఉంది. బీరువాలో దుస్తులు, వస్తువులను చిందరవందర చేసి అందులోని 13 తులాల బంగారంతో పాటు రెండున్నర లక్షల రూపాయల నగదును అపహరించుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ నర్సింహులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లగొండ నుంచి క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలను సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మద్యం మత్తులో వ్యక్తి మృతి



బాలరాజు మృతదేహం

**చింతపల్లి :** మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండల పరిధిలోని రాజ్యానాయక్‌తండా వద్ద శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని పాతబస్తీ కాటేడన్‌కు చెందిన వింజమూరి బాలరాజు (44)మూడు రోజుల క్రితం బొడ్రాయి పండుగకు నసర్లపల్లిలోని కూతురు ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం పూటుగా మద్యం తాగి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో నసర్లపల్లి, రాజ్యానాయక్ తండాల మధ్య ఉన్న సరిహద్దులో రోడ్డు పక్కన పడి మృతిచెందాడు. అటు వైపుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అతిగా మద్యం తాగి ఎండవేడిమికి మృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మరోసారి పల్లెప్రకృతి వనం నర్సరీ ధ్వంసం

**చిలుకూరు:** మండలంలోని నారాయణపురం గ్రామంలో ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలోని వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం మరో సారి ధ్వంసం చేశారు. పల్లెప్రకృతి వనంలో ఏర్పా టు చేసిన మంచినీటి ట్యాంక్‌ను, స్తంభాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అ ప్రదేశంలో ఏర్పాటు చేసిన షేడ్ నెట్‌ను దొంగిలించారు. మూడు నెలల క్రితం క్రీడా సామగ్రిని తదితర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి రెండు లక్షల వరకు ఆస్తి నష్టం కలిగించారు. ఈ విషయంపై అప్పట్లో గ్రామ కార్యదర్శి సారిక చిలు కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తులను నష్టం కలిగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా సర్పంచ్ తమ్మనబోయిన శంకర్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి దోషులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై శనివారం పోలీసులకు మరో మారు ఫిర్యా దు చేయనున్నట్లు కార్యదర్శి తెలిపారు.

## మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

**ఆత్మకూరు(ఎం):** గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ చేశాడు. ఈ ఘటన మండలంలోని లింగరాజుపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బొడిగె మానస గురువారం రాత్రి ఇంటి మీద పడుకుంది. గుర్తుతెలియని వ్యక్తి ఇంటి పైకి ఎక్కి మానస మెడలో ఉన్న పుస్తెలతాడును తెంచుకునిపోయాడు. మానస అరవడంతో భర్త తేరుకుని చూసేలోపు గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. విషయం పోలీసులకు తెలియడంతో రామన్నపేట సీఐ మోతిరామ్, ఆత్మకూరు(ఎం) ఎస్ఐ దొమ్మేటి నాగరాజు, సీసీఎస్ పోలీసుల బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, దుండగుడు చోరీ చేసిన పుస్తెల తాడు రోల్డ్ గోల్డ్ అని తెలిసింది.




## వ్యవసాయ బావిలో పడి వ్యక్తి గల్లంతు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**చివ్వెంల(సూర్యాపేట) :** ప్రమాదవశత్తూ వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని జయరాం గుడి తండాలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుగులోతు రవి (26) వ్యవసాయంతో పాటు మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో రోజు మాదిరిగానే వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన రవి ప్రమాదవశత్తూ బావిలో పడిపోయాడు. అక్కడే ఉన్న తమ్ముడు హుస్సేన్ కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. బావిలో 20 అడుగుల లోతు వరకు నీరు ఉంది. రవి ఆచూకీ తెలుసుకునేందుకు ఎస్ఐ మధు సంఘటన స్థలానికి చేరుకుని మోటార్ల సహాయంతో నీటిని బటయకు తీసి గాలింపు చర్యలు చేపడుతున్నారు. కాగా రవి మానసిక స్థితి సరిగా ఉండదని, కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో మానస్తాపంతో బావిలో దూకి ఆత్మహత్య చేసున్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**కనగల్:** అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు కనగల్ ఎస్ఐ నాగేష్ శుక్రవారం తెలిపాడు. పులిమామిడి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు పగిళ్ల యాదగిరి, బొమ్మపాల రాములు, దేప సైదిరెడ్డి, దేవ సురేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వారి ఆన్‌లైన్ ఇసుక రవాణాను కూడా రద్దు చేస్తామన్నారు.

## తెలుగు రాష్ట్రాల మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న ఇరుజట్ల క్రీడాకారులు

**తిరుమలగిరి(నాగార్జునసాగర్) :** భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలను శుక్రవారం రాత్రి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కుందూరు జైయ్‌వీర్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మట్లాడారు. దేశం కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చని, క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శాగం పెద్దిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్, నాయకులు అనుముల అంజి పాల్గొన్నారు.

# ధాన్యం రవాణాకు అష్టకష్టాలు

- అధికారులు రోడ్డెక్కినా కనిపించని ప్రయోజనం



లారీలను ఆపేందుకు రోడ్డు వెంట నిరీక్షిస్తున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

**మాడుగులపల్లి:** లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాంటాల్లో జాప్యం రైతులకు, అధికారులకు తలనొప్పిగా మారింది. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన బస్తాలను తరలించేందుకు శుక్రవారం లారీలు రాలేదు. దాంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు రంగంలోకి దిగారు. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై వెళ్తున్న ఖాళీ లారీలను ఆపి కొనుగోలు కేంద్రంలోకి మళ్లించేందుకు యత్నించారు. కానీ గంటలపాటు నిరీక్షించినా ఖాళీ లారీలు దొరక్కపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ట్రాక్టర్లలోనూ ధాన్యం తరలించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా హమాలీలు నిరాకరిస్తున్నారని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిరోజులుగా అధికారులు ఖాళీ లారీలను నిలిపి ధాన్యం తరలిస్తుండడంతో విషయం తెలిసి కొంత మంది డ్రైవర్లు ఈ మార్గంలో ఖాళీ లారీతో రావడం లేదని తెలుస్తోంది.



## ఎంజీయూ సమాచార న్యూస్ లెటర్ ఆవిష్కరణ



న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ

**ఎంజీయూ (నల్లగొండ రూరల్) :** మహాత్మాగాంధీ యూనివర్సిటీ అకాడమిక్ సమాచారం సమాజానికి చేరవేసే బాధ్యత యూనివర్సిటీపై ఉందని వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో అకాడమిక్ సమాచార న్యూస్ లెటర్ విడుదల చేసి మాట్లాడారు. న్యూస్ లెటర్‌ను ఒక మాధ్యమంగా సమాజానికి యూనివర్సిటీ కార్యక్రమాలను నివేదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, అద్యాపకులు రవి, అంజిరెడ్డి, శ్రీదేవి, అరుణప్రియ, రవీందర్‌రెడ్డి, భిక్షమయ్య, శ్రవణ్, లక్ష్మీప్రభ తదితరులు పాల్గొన్నారు.

## కారు, డీసీఎం ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**చివ్వెంల(సూర్యాపేట) :** కారు, డీసీఎం ఢీకొనడంతో ముగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని జి.తిర్మలగిరి వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామ శివారులో ముందుగా వెళ్తున్న డీసీఎం సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ కూసూరి మాణిక్యాల రావు, బత్తుల సుధా, శ్రీమాన్‌లకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జూన్ 14 నుంచి డిగ్రీ పరీక్షలు

**నల్లగొండ రూరల్ :** జూన్ 14 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 30 నుంచి జరగాల్సిన 4,6 సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు వాయిదా వేసి జూన్ 14నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1, 2, 3, 5సెమిస్టర్‌ల బ్యాక్‌లాగ్ పరీక్షల తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. కాగా పరీక్షలు వాయిదా కారణంగా పలు ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులను ఖాళీ చేసి వెళ్లిపోవాలని వార్డన్‌లు ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రైవేటు కాలేజీల ఒత్తిడి మేరకు పరీక్షలను వాయిదా వేయడంపై పలు అనుమాలు వ్యక్తం అవుతున్నాయి.

## టార్గెట్ బాల్ గేమ్‌కు ఎంపిక



గోపికృష్ణ

**గరిడేపల్లి :** జాతీయ స్థాయి టార్గెట్ బాల్ గేమ్‌కు గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రధాని గోపి కృష్ణ ఎంపికైనట్లు సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు నగేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16వ తేదీల్లో హైదరాబాద్‌లోని అల్వాల్‌లో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి ఎంపికయ్యాడని తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి ఉత్తర ప్రదేశ్‌లోని ముత్తర లోని జీఎల్ఏ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు తెలంగాణ జట్టు నుంచి గోపి కృష్ణ క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# జాతీయ రహదారిపై రైతుల ధర్నా

- కొనుగోలు కేంద్రాలకు లారీలను తరలించిన పోలీసులు



కట్టంగూర్‌లో హైవేపై ధర్నా చేస్తున్న రైతులు

**కట్టంగూర్ :** కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం ఎగుమతి నిలిచిపోవటంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం కట్టంగూర్‌లో నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కట్టంగూర్, ఈదులూరు, అయిటిపాముల గ్రామాలకు చెందిన రైతులు లారీల కొరత తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రోడ్డెక్కారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు పేరుకుపోయాయని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, జెడ్పీటీసీ తరాల బలరాములు రైతుల వద్దకు చేరుకొని హైవేపై లారీలను ఆపి ఆయా కేంద్రాలకు పంపారు.